క్లుప్తంగా

పరామర్శ



అప్పయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండల కేంద్రం సహా కోడూరులో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం కలిసి పరామర్శించారు. తొలుత స్థానిక ఎస్సీ వీధికి వెళ్లిన ఆయన..చనిపోయిన కండి అప్పయ్య ఇంటికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అప్పయ్య మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత కోడూరు వెళ్లి కోడూరు చిన్నను పరామర్శించి, ఆయన తల్లి రమణమ్మ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని సానుభూతి వ్యక్తం చేశారు. ఇదే గ్రామంలోని మాజీ ఎంపీటీసీ మడక నారాయణను పరామర్శించారు. ఆయన కొడుకు అశోక్ కేన్సర్‌తో మంచానపడి ఉండడాన్ని తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

ట్రాఫిక్ అవస్థలు



నిలిచిపోయిన వాహనాలు

రాజాం: ఓ ప్రణాళిక లేకుండా రోడ్డు కల్వర్టు పనులు ప్రారంభించడంతో ట్రాఫిక్ అవస్థలు నెలకొంటున్నాయి. రాజాం నుంచి శ్రీకాకుళం వెళ్లే ప్రధాన రహదారిలో మొగిలివలస పెట్రోల్‌బంకు సమీపంలో రోడ్డు వద్ద కల్వర్టు నిర్మాణానికి శనివారం గోతులు తీశారు. అదే సమయంలో రోడ్డు ఇరుకుగా మారడంతో పాటు అస్తవ్యస్తంగా మట్టిని వేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆ దారిలో ఇరువైపులా వచ్చే వాహనాలు గంటల కొద్దీ నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజాం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు అస్తవ్యస్తంగా ఉన్న అక్కడి మట్టిపోగులు తొలగించారు. దీంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది.

నేడు 'కళాభారతి'లో సాంస్కృతిక కార్యక్రమాలు

రాజాం: స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు రాజాం కళా క్రియేషన్స్ 75వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, గోకవలస కృష్ణమూర్తిలు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ యడ్ల గోపాలరావుతో పాటు పలువురుకు సత్కారాలు చేయడం జరుగుతుందని, దానికన్నా ముందు ప్రముఖ రంగస్థల కళాకారులు గోకవలస కృష్ణమూర్తి మనుమరావు నొగట్ల రియాన్సీచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం కళాక్రియేషన్స్ డోలపేట వారిచే కెరటాలు అనే సాంఘిక నాటిక ప్రదర్శన కూడా ఉంటుందన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

బొబ్బిలిరూరల్: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రతినిధి వెంకటరమణ హెచ్చరించారు. మండలంలోని సీహెచ్ బొడ్డవలస పంచాయతీ, కొయ్యికొండవలస గిరిజన గ్రామంలో ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, మేనరిక వివాహాలు చేయవద్దని తెలిపారు. 18 ఏళ్లు నిండని బాలికలకు వివాహం చేయవద్దని, ఎవరైనా ఆ తరహా పెళ్లి చేస్తే రెండేళ్ల జైలుశిక్ష పడుతుందన్నారు.

కామ్రేడ్ అచ్యుతానందన్‌కు ఘనంగా నివాళులు



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రాజాం సిటీ: కమ్యూనిస్టు దిగ్గజం, కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ ఆశయాల సాధనకు ప్రజాసంఘాలు నడుంబిగించాలని ప్రజాసంఘాల నాయకుడు సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. మండలంలోని కంచరాంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపోరాటాలకే జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు అచ్యుతానందన్ అని కొనియాడారు. వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాల ఐక్యతకు కృషిచేసిన ఉద్యమ శిఖరం ఆయన అని అన్నారు. కార్యక్రమంలో సత్యారావు, శంకరరావు, శ్రీనివాసరావు, ఆదియ్య, నాగరాజు, చిన్నారావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

రేగిడి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు అసైన్‌మెంట్ పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఎంఈవో ఎంవీ ప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అసైన్‌మెంట్ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని, సబ్జెక్టుల పట్ల అవగాహనకు ఇవి ఉపకరిస్తాయన్నారు.

చంద్రబాబు పాలనలో..
పథకాల్లో కోతలే ఎక్కువ

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రాజాం: పుచ్చలవీధిలో ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



బొబ్బిలి: ఇంటింటికీ వెళ్లి కూటమి కుట్రలు తెలియజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



రాజాం సిటీ: బొమ్మినాయుడువలసలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం

బొబ్బిలి: చంద్రబాబు పరిపాలనలో ఏ కాలమైనా తీసుకోండి..ఆయన ఇచ్చిన పథకాల్లో కోతలు తప్పకుండా ఉంటాయని అలాగే ప్రజలకు వాతలు లేకుండా ఆయన ఒక్క కార్యక్రమం కూడా సాగదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని 13వ వార్డులో శనివారం పర్యటించిన ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ఏడాది పాలనలో ప్రజలకు జరుగుతున్న మోసాన్ని వివరించారు. ఎన్నికల సమయంలో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లే ఇస్తున్నారని అది కూడా కొంతమందికేనన్నారు. అలాగే తల్లికి వందనం పథకం డబ్బులు కూడా ఒక్కొక్కరికి ఒక్కోలా పడ్డాయన్నారు. ఈ పథకం కింద మొదట్లో రూ.15 వేలు ఇస్తామన్నారని, ఇప్పుడు ఒకరికి రూ.13 వేలు ఇస్తున్నారన్నారు. ఇవి కూడా ఒకరికి రూ.13 వేలు, మరొకరికి రూ.10 వేలు, ఇంకొకరికి రూ.9 వేలు అందాయన్నారు. చాలామంది అర్హులకు డబ్బులు అస్సలు పడలేదన్నారు. అన్నదాత సుఖీభవ కూడా చాలామంది అర్హులకు అందకుండా పోయిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, లేకుంటే ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. ప్రజలు ఇప్పుడిప్పుడే అంతా గమనిస్తున్నారని, గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను పరిశీలిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి కుతంత్రాలు, కుళ్లు రాజకీయాలు, కక్షపూరిత పాలనకు చరమగీతం పాడడం ఖాయమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్వీ మురళీ కృష్ణారావు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా కార్యదర్శి శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పార్టీలకు కాలం చెల్లింది: డాక్టర్ తలే రాజేష్

రాజాం: కూటమి పార్టీలకు కాలం చెల్లిందని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక పట్టణంలోని పుచ్చలవీధి, లచ్చయ్యపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. కూటమి ఎన్నికల హామీల అమలుకు గ్యారెంటీ బాండ్లు ఇచ్చిన కూటమి కార్యకర్తలు ఎందుకు ఎక్కడా కనిపించడం లేదని ప్రజలను అడిగారు. కూటమి మోసపూరిత, కుట్రపూరిత పాలనను ప్రశ్నించాలని, వారిచ్చిన ఎన్నికల హామీల అమలుపై నిలదీయాలని పిలుపునిచ్చారు. అలాగే వైఎస్సార్ సీపీ హయాంలో జనానికి జరిగిన మంచి, కూటమి హయాంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని క్షుణ్ణంగా తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఆసపు సూర్యం, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, జిల్లా కల్చరల్ వింగ్ కన్వీనర్ డాక్టర్ నరేంద్ర, పెన్షనర్ల వింగ్ కన్వీనర్ పాలవలస శ్యామ్‌సుందరరావు, వలంటీర్ల వింగ్ కన్వీనర్ దాసరి అనూష, వీవర్స్ వింగ్ అధ్యక్షుడు బొమ్మన సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాజాం సిటీ: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముద్దాడ జోగివలస, బొమ్మినాయుడువలస గ్రామాల్లో వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు శనివారం పర్యటించి, ఏడాది కాలంగా ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు పంపిణీ చేయకుంటే ఎలా?



మాట్లాడుతున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నించిన సభ్యులు

తెర్లాం: ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయకపోతే ఎలా అని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై ఎంపీడీవో రేగి రాంబాబు సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో రైతు సేవా కేంద్రాల ద్వారా ఇంతవరకు 331 టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేశామని ఏఈవో వెంకటేష్ తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఇతర సభ్యులు ఒక ఎకరాకు ఎన్ని బస్తాల ఎరువులు వేయాలని అడిగారు. రైతులకు సరిపోయే ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో సరఫరా చేయడం లేదని, ఎన్ని ఎకరాల భూములు ఉన్నా ఆధార్‌కార్డుకు ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తే ఎలా సరిపోతుందని వారు నిలదీశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో అందించారని, ఈ ప్రభుత్వంలో ఎరువుల కోసం రైతులు నానాపాట్లు పడాల్సి వస్తోందదని పణుకువలస, రంగప్పవలస, కూనాయవలస, విజయరాంపురం తదితర గ్రామాల సర్పంచ్‌లు తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేస్తారా, చేయరా తెలియజేయాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని ఏఈఓ వెంకటేశ్ తెలిపారు. విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించగా లింగాపురం సర్పంచ్ బూరాడ తవిటినాయుడు మాట్లాడుతూ తమ గ్రామాలకు జేఎల్ఎం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని విద్యుత్ శాఖ మండల ఏఈ తెంటు శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖలపై నిర్వహించిన సమీక్షలో సభ్యులు తెలియజేసిన అన్ని సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీవో రాంబాబు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ గర్భాపు లూర్దు, వైస్ ఎంపీపీ రమాదేవి, ఉప తహసీల్దార్ గొంగాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

బొబ్బిలి: ద్విచక్ర వాహనాలు నడిపే వారంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ కె.సతీష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలో వాహనదారులకు వాహన చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వాహనంతో రోడ్డు మీదికి వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని, అలాగే లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

ఆలయంలో చోరీ

సంతకవిటి: మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ పూజారి నేతాజి తెలిపిన వివరాల ప్రకారం ఆలయ తాళాలు పగలగొట్టి హుండీని దొంగలించి మందరాడ రోడ్డులోని చెరువు వద్ద వదిలి వెళ్లారు. సంతకవిటిలో నిత్యం ఏదో ఒక దొంగతనం జరుగుతూనే ఉంది. ఇటీవల మద్యం షాపులో జరిగిన దొంగతనం, బస్టాండ్ ఆవరణలోని షాపుల్లో నిత్యం షాపు తాళాలు పగలగొట్టి నగదును దొంగిలించడం వంటి ఉదంతాలెన్నో. ఈ దొంగతనాలన్నీ ఆకతాయిల పనే అంటూ బాహాటంగానే వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. దొంగతనాలు అరికట్టేందుకు పోలీసులు అంబేడ్కర్ కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ ఆకతాయిల ఆగడాలు ఆగడం లేదు. ఈ చోరీపై పోలీసులను సంప్రదించగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రైతుల వైపు నిలబడి పోరాడుతా



గిరిజన రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

రామభద్రపురం: భూ సమస్యలపై పోరాడుతున్న గిరిజన రైతుల వైపు నిలబడి పోరాడతానని ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు అన్నారు. మండలంలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన గ్రామాల రైతులు చాలా రోజులుగా భూ సమస్యలపై పోరాడుతున్న విషయం తెలుసుకున్న ఆయన శనివారం వారు సాగు చేస్తున్న భూములను పరిశీలించారు. ఈ భూముల్లో ఎప్పటి నుంచి సాగులో ఉన్నారు..మీ దగ్గర నుంచి భూములు తీసుకునేటప్పుడు మీకు నోటీసులు ఇచ్చారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం తమ భూములను దౌర్జన్యంగా లాక్కుంటున్నారని వారు తెలిపారు. అమాయకులైన గిరిజనులను మోసం చేస్తే ఊరుకునేది లేదని, కోర్టులో కేసు వేసి అయినా బాధిత గిరిజనులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పింగళి వెంకయ్య



బాడంగి గ్రంథాలయంలో పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్, పాఠకులు

రాజాం సిటీ: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ఆదర్శప్రాయుడని రెడ్‌క్రాస్ రాజాం అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కొనియాడారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పింగళి జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం చివరి క్షణం వరకు పాటుపడిన మహనీయుడు పింగళి అని కొనియాడారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్న హైందవి తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 149వ జయంతి శనివారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, పాఠకులు కలిసి పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో పింగళి వెంకయ్య జయంతి శనివారం నిర్వహించారు. లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్, విద్యార్థులంతా పింగళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



వంగర: కోణంగిపాడులో బిడ్డకు తల్లిపాలు ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్‌వైజర్ మేరి

తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహారం ప్రయోజనాలపై ఐసీడీఎస్ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని, ఆ పాలు బిడ్డకు అమృతమని పేర్కొన్నారు. ప్రతి తల్లి అప్పుడే పుట్టిన తన బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు పాలు ఇవ్వాలని, అలా అయితే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు.

–బొబ్బిలి, తెర్లాం, బాడంగి, వంగర, రేగిడి



తెర్లాంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఐసీడీఎస్ పీవో వరహాలమ్మ

ప్రజలను మభ్యపెట్టేందుకే బాబు సింగపూర్ టూర్!

- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: ప్రజలను మభ్యపెట్టేందుకే చంద్రబాబు సింగపూర్ టూర్ అని, ఆయన అక్కడకు వెళ్లి ఒక్క కంపెనీ కూడా తెచ్చింది లేదని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సింగపూర్ టూర్ వెళ్లి అక్కడి హోటళ్ల కొనుగోలు, వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టిన అంశం అప్పట్లో ఓ సంచలనమైందని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే మళ్లీ సింగపూర్ టూర్ వెళ్లారంటే ఈ ఒక ఏడాది కాలంలో మీరు సంపాదించింది మళ్లీ అక్కడ పెట్టుబడులు పెట్టడానికా లేక ఇక్కడకు పెట్టుబడులు తేవడానికా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకువస్తామని చెప్పి సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు మంత్రి లోకేష్, మరో మంత్రి నారాయణ సింగపూర్ వెళ్లి ఒక్క పరిశ్రమ అయినా పెట్టుబడులైనా తేలేదని ధ్వజమెత్తారు. ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమే సింగపూర్ వెళ్లి ఏదో తెస్తామని చెప్పి, ఆఖరికి ఖాళీ చేతులతోనే వచ్చారన్నారు. ఒక్క ఎంఓయూ కూడా కుదుర్చుకోలేదని దుయ్యబట్టారు. మీ సొంత ప్రయోజనాల కోసమే సింగపూర్ వెళ్తున్నారని ప్రజలంతా గ్రహించారన్నారు. రాష్ట్రంలో కూటమి సృష్టిస్తున్న భయానక వాతావరణం చూసి ఏ ఒక్క కంపెనీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు రావడం లేదని ధ్వజమెత్తారు. ప్రజల్లో జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకనే ఇటీవల ఆయన నెల్లూరు పర్యటనకు ప్రజలను రానీయకుండా కుట్ర పన్నారని అయినా వారి కుట్రలు భగ్నమయ్యాయన్నారు. జేసీబీలు పెట్టి రోడ్లకు అడ్డంగా గుంతలు తీసినా, పోలీసులతో నిర్బంధించినా అభిమానులు ఆగలేదన్నారు. జగనన్న కోసం జనం పరుగులెత్తుకుని వచ్చారన్నారు. ఇప్పటికైనా కక్షపూరిత రాజకీయాలు మానుకుని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని హితవుపలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు తమ్మిరెడ్డి దామోదరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

బాడంగి: బెంగళూరులోని వసుధైక కుటుంబం ఫౌండేషన్, క్రేజీ బీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు అనాథ విద్యార్థులకు అందిస్తున్న స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానిక హైస్కూల్ స్పెషల్ టీచర్ కొల్లి ఈశ్వరరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. అర్హులైన విద్యార్థులంతా పదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్‌కు 8, 9, 10 తరగతులు చదువుతున్న అనాథ విద్యార్థులు అర్హులన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలావతి

రేగిడి: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ పి.నీలావతి పిలుపునిచ్చారు. మండలంలోని రేగిడి, ఉంగరాడమెట్ట, ఆమదాలవలస గ్రామాల్లో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలు కాకూడదన్నారు. గంజాయి, ఖైనీ, గుట్కా, కొకైన్ వంటి వాటిని తీసుకోకూడదన్నారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: స్థానిక కోర్టు సముదాయంలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, బ్యాంకు అధికారులు, పోలీసులు, చిట్‌ఫండ్ కంపెనీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులన్నీ లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నామన్నారు. న్యాయవాదులు, పోలీసులు లోక్‌అదాలత్‌కు సహకరించి వీలైనన్ని కేసులను పరిష్కరించుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఈ అవకాశాన్ని కక్షిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.నైమిష, బార్ అసోసియేషన్ కార్యదర్శి బి.తిరుపతిరావు, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.